# అతడు-ఆమె : మనం

ఉప్పల లక్ష్మణరావుగారి నవలపై సాహిత్య విమర్శ

## ఓల్గా



**athadu-aame-manam**
**Volga**

**అతడు-ఆమె-మనం**
**ఓల్గా**

రెండవ ముద్రణ : ఆగస్ట్ 2005

డిజైన్, బుక్‌మేకింగ్ : జుగాష్‌విలి

డి.టి.పి.: కవిత, హైద్రాబాద్
ముద్రణ: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైద్రాబాద్

ప్రతులకు
నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైద్రాబాద్
దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైద్రాబాద్
నవయుగ బుక్‌హౌస్, సుల్తాన్‌బజార్, హైద్రాబాద్
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు
విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు
తెలుగుబుక్ హౌస్, కాచిగూడ, హైద్రాబాద్

**వెల : 50 రూ॥లు**

## ఓల్గా ఇతర రచనలు

**నవలలు**

సహజ
స్వేచ్ఛ
మానవి
కన్నీటి కెరటాల వెన్నెల
ఆకాశంలో సగం
గులాబీలు

**కథా సంకలనాలు**

రాజకీయ కథలు
ప్రయోగం
భిన్న సందర్భాలు
ప్రయోగం
(రాజకీయ కథలు -2)

**సంపాదకత్వం**

మాకు గోడలు లేవు
నీలిమేఘాలు
నూరేళ్ళ చలం
సారాంశం
సరిహద్దులులేని సంధ్యలు
మహిళావరణం
జీవితమే ఒక ప్రయోగం
అలజడి మా జీవితం

**అనువాదాలు**

సామాన్యుల సాహసం
భూమి పుత్రిక
మిస్సింగ్
మూడు తరాలు
పుట్టని బిడ్డకు తల్లి ఉత్తరం
ఉరికొయ్య అంచున
నేనూ సావిత్రీబాయిని

**ఇతరములు**

అతడు-ఆమె:మనం (సాహిత్య విమర్శ)
కుటుంబ వ్యవస్థ - మార్క్సిజం (వ్యాసం)
వాళ్ళు ఆరుగురు (నాటిక)
యుద్ధము-శాంతి (నృత్య రూపకం)
చరిత్ర స్వరాలు (రూపకం)
పలికించకు మౌనమృదంగాలను (సాహిత్య వ్యాసాలు)
తొలివెలుగులు (స్త్రీవాదవ్యాసాలు)

# ముందుమాట

గత 40 సంవత్సరాలలో వచ్చిన మంచి నవలల్లో అతడు – ఆమె ఒకటి. ఈ నవలను 1950లలో లక్ష్మణరావుగారు ప్రచురించారు. 1940ల లోనే ఈ నవల రాసినా అనేక కారణాలవల్ల దానిని అనేక చోట్ల మార్చి 1950ల నాటికి అచ్చు వేయించారు. ఐతే ఆ రోజుల్లో ఈ నవల గురించి సమీక్షలేమీ రాలేదు. ఆ విషయం గురించి లక్ష్మణరావుగారు బతుకు పుస్తకంలో "పుస్తకం ప్రచురించి విడుదల చేశాను. కానీ నవలను సమీక్షించేవారే లేక పోయారు. నవలలో చేవ అంటూ వుంటే పుస్తకానికి యెప్పటికైనా పాఠకులంటూ ఉండకపోరు" అని చెప్పారు.

ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం. సాహిత్యవిమర్శ విషయంలో తెలుగు సాహిత్యం వెనకబడివున్నదనటానికి నిదర్శనం. ఒక మంచి పుస్తకం రాగానే విమర్శకులు స్పందించి ఆ పుస్తకాన్ని పాఠకులకు పరిచయం చెయ్యాలి. ఒక చెత్త పుస్తకం పాఠకులపైబడి వారిని పక్కదారులు పట్టిస్తుంటే విమర్శకులు ఆ పుస్తకంలోని విషయాలు సమాజానికి ఏ విధంగా హానికరమో వివరించి పాఠకుల అభిరుచిని మెరుగు పరచాలి. ఇది విమర్శకుల కర్తవ్యం. అతడు – ఆమె గురించి కనీసం సమీక్షలు కూడా రాలేదంటే సరియైన విమర్శకులు లేకపోవటం వల్లనే అని అనుకోవాల్సి వస్తోంది. తెలుగు నవలల గురించీ, తెలుగు నవలల్లోని వస్తుశిల్పాల్ని గురించీ కొన్ని పరిశోధనా గ్రంథాలు వచ్చాయి. ఐతే వాటిలో ఎక్కడా అతడు–ఆమెకు తగినస్థానం లేదు. బాధ్యతగా పరిశోధన చేసేవారి దృష్టిలోకి కూడా అతడు–ఆమె రాకపోవటం ఆశ్చర్యకరమే.

జాతీయోద్యమ నవలగా, స్త్రీ పురుష సంబంధాలను చర్చించే నవలగా 'అతడు – ఆమె'కు తెలుగు సాహిత్యంలో విశిష్టమైన స్థానం వున్నది. జాతీయోద్యమాన్ని గురించి కేవలం ఆవేశంతో ఉత్సాహంతో రాసిన నవలకాదు. జాతీయోద్యమాన్ని గురించి ఎంతో అధ్యయనం చేసి రాసిన నవల. లక్ష్మణరావుగారికి జాతీయోద్యమంతో ఆత్మీయమైన సంబంధం కూడా ఉంది. 1929లో జరిగిన లాహోరు కాంగ్రెసు సభలకు లక్ష్మణరావుగారు మెల్లీగారు హాజరయ్యారు. గాంధీగారు ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించబోతూ అప్పటి వైస్రాయి ఇర్విన్‌కు రాసిన ఉత్తరాన్ని మెల్లీగారు జర్మన్ భాషలోకి అనువదించారు. సబర్మతి ఆశ్రమ జీవితాన్ని శ్రద్ధగా పరిశీలించారు. క్విట్టిండియా ఉద్యమంలో లక్షణరావుగారు కమ్యూనిస్టుపార్టీ పంథాను సమర్ధించి అనుసరించారు. మెల్లీగారు క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని జైలుకి వెళ్ళారు. వారిద్దరూ ఈ ఉద్యమం గురించి చాలా వివరంగా చర్చించుకున్నారు. ఉద్యమంతో రచయితకు యింత ఆత్మీయమైన సంబంధం ఉండటం వల్లనే అతడు–ఆమె నవల మంచి జాతీయోద్యమ నవల కాగలిగింది.

అతడు–ఆమె చాలా యిష్టంగా చదివే పాఠకుల సంఖ్య తక్కువ కాదు. ఆ నవల చదివినవారు సజీవమైన ఆ కథనూ శాంతంనూ శాస్త్రినీ నిత్యం తలుచుకుంటారు. పాఠకుల హృదయాల్లో అతడు–ఆమెకు ఉన్నత స్థానమే ఉంది. మంచి రచనకు సముచిత స్థానం అదే. అతడు–ఆమె నవల లోని కొన్ని విషయాలనూ సమస్యలనూ చర్చకు పెట్టటమే ఈ సమీక్ష రాయటంలో నా ప్రధానోద్దేశం. ఆ విషయాల గురించి ఎంత ఎక్కువగా చర్చజరిగితే సమాజానికి అంత ఎక్కువ ఉపయోగం.

– ఓల్గా





# అతడు - ఆమె: మనం

లోకంలో మంచి రచయితలూ ఉంటారు. గొప్ప వ్యక్తిత్వం కలిగిన మనుషులూ ఉంటారు. కానీ మంచి రచయితా, గొప్ప వ్యక్తీ ఒకడే అవటం చాలా అరుదుగా జరిగే విషయం. అటువంటి అరుదైన మనిషి లక్ష్మణరావుగారు. అరుదైన రచన అతడు–ఆమె. లక్ష్మణరావుగారి వ్యక్తిత్వాన్నీ ఆయన రచనల్నీ విడదీసి చూడలేం. ఆయన రచనలు ఆయన వ్యక్తిత్వంలో ఒక భాగం. ఆయన రచనల సారాంశమే ఆయన వ్యక్తిత్వం.

లక్ష్మణరావుగారు అభ్యుదయ రచయిత. అభ్యుదయ సాహిత్యం ఒక సామాజిక శక్తి. జీవితం అనుకోకుండా జరిగే కొన్ని సంఘటనల తోరణం కాదనీ, జీవితాన్ని నడిపే సూత్రాలు కొన్ని ఉన్నాయనీ, వాటిని అర్థంచేసుకుని ఉపయోగించుకుంటే జీవితాన్ని మంచిమార్గాన నడిపించవచ్చనీ నమ్మేవారు అభ్యదయ రచయితలు. జీవితాన్ని అర్థం చేసుకోవటానికి ఒక్క జీవితానుభవమే చాలదు. కొన్ని సాంఘిక సిద్ధాంతాలు తెలిసి వుండటం కూడా అవసరం. ఈ సాంఘిక సిద్ధాంతాల ఆధారంతోనే సాహిత్యం కూడా అభివృద్ధి చెందుతుంది. ఈనాడు మంచి నవలలు అనుకున్న వాటిలో కూడా జీవితం ప్రతిబింబించుతోంది గానీ జీవిత సూత్రాలు లోపిస్తున్నాయి. జీవితం వెనకాల వున్న సూత్రాన్ని తెలుసుకోకుండా తెలియపరచకుండా జీవితాన్ని ఎంత వివరంగా చిత్రించినా ఏమీ ప్రయోజనం లేదు. జీవిత సూత్రాలను అర్థం చేసుకున్న రచయితే అభ్యుదయ రచనలు చేయగలుగుతాడు. కనుక రచయితలకు జీవితానుభవమూ, దాని వెనకాల వున్న జీవిత సూత్రాలను గమనించే నిశితమైన దృష్టీ వుండాలి. ఒక రచయితకు రచనా

సామర్థ్యం పెద్దగా లేకపోయినా ప్రమాదం వుండదు గానీ జీవితం, దానిని నడుపుతున్న సూత్రాలు-యివి తెలియకపోతే చాలా ప్రమాదం.

రచయితగా లక్ష్మణరావుగారిలో ఈ మూడు లక్షణాలూ వున్నాయి. ఆయనకు జీవితం తెలుసు. కావలసినంత జీవితానుభవం వుంది. ఆ అనుభవాల వెనకవున్న సత్యమేమిటో, జీవితాన్ని నడిపిస్తున్న సూత్రాలేమిటో సంపూర్ణంగా తెలుసు. మంచి రచనా సామర్థ్యం వుంది. అందువల్లే ఆయన గొప్ప అభ్యుదయ రచయిత కాగలిగారు. అతడు-ఆమె అత్యుత్తమమైన అభ్యుదయ రచన కాగలిగింది.

అతడు-ఆమె నవలలో లక్ష్మణరావుగారు ఎన్ని విషయాలనో చర్చించారు. ఎన్ని విషయాల గురించో మన కళ్ళు తెరిపించారు. అవన్నీ తరువాత - ముందు ఆ నవల మొత్తంగా సాధించిన ప్రయోజనం ఏమిటి? అన్న విషయం ఆలోచిద్దాం. జాతీయోద్యమం గురించీ, స్త్రీ పురుష సంబంధాల గురించీ ఈ పుస్తకం మనలో ఆలోచనలను రేకెత్తిస్తుంది. ఆ విషయాల గురించి మనం యింకా యింకా ఆలోచించి అభిప్రాయాలేర్పరుచుకుంటాం. కానీ ఏ ఒక్క సమస్య విషయంలోనో కాకుండా మొత్తంగా అతడు-ఆమె నవల ప్రభావం పాఠకుడిపై ఏమిటి? ఆ నవల చదవక ముందూ, నవల చదివాకా పాఠకుడి స్థితిలో ఒచ్చే మార్పులేమిటి? ఈ రకంగా ఆలోచిస్తే అతడు-ఆమె నవల మనిషి సంస్కారాన్ని పెంచటంలో ఎంతో ఉపయోగపడుతుంది. ఆ నవల చదివే వ్యక్తి కొంచెం నిజాయితీ వున్నవాడైతే చాలు - ఆ నవల చదివాక ఎంతగానో సంస్కరించబడతాడు.

ఇక్కడ నేను చెప్పే సంస్కారానికీ సంస్కరణ వాదానికీ ఏమీ సంబంధం లేదు. జీవితంలోని కష్టాలనూ, సమస్యలనూ మామూలుగాచూసి భయపడటం చిరాకుపడటం కాకుండా ఆ సమస్యల పరిష్కార మార్గాలను అన్వేషించగల శక్తిని సంపాదించుకున్న మనిషిని నేను సంస్కారవంతుడు అని అంటున్నాను. ఈ రకమైన సంస్కారాన్ని గురించి కొడవటిగంటి కుటుంబరావుగారు ఒక వ్యాసంలో వివరించారు. ఆయన పామును ఉదాహరణగా చూపి సంస్కారాన్ని గురించి వివరించారు. "ఉదాహరణకు పామును తీసుకోండి పాము మనకు భయాన్ని ప్రేరేపిస్తుంది. ఈ భయం మనల్ని ఆవేశించినంత కాలమూ పాము మనకు తెచ్చిపెట్టే సమస్యల్ని పరిష్కరించలేం. పాముకాటుకు విరుగుడు కనిపెట్టాలంటే పాము యెడల వుండే భయాన్ని దాటి పాముని పట్టుకుని విషం పిండి దానికి విరుగుళ్ళు అన్వేషించే శక్తిరావాలి."

"పాములను చంపటం అవసరం కావచ్చు గాక, పాము విషానికి విరుగుడు కనిపెట్టడం సంస్కార దృష్టిలో యింకా ముఖ్యమైనది. జీవితాన్ని గురించిన నిర్లిప్తమైన





సాంస్కారిక దృష్టి పెరిగిన కొద్దీ జన సామాన్యం జీవిత సమస్యలతో సరిగా పోరాడగల్గుతుంది" అతడు-ఆమె నవల యిటువంటి సంస్కారదృష్టిని పాఠకులకు కలిగిస్తుంది.

సమస్యను సమస్యగా చూసి అది ఎట్లా పరిష్కారం అయితే తన జీవితానికి ఉపయోగమో ఆలోచించి పనిచేసే శాస్త్రినీ, సమస్యలను తన జీవిత పరిధిలోనుంచికాక విడదీసి చూసి వాటి కారణాలను కనుగొని పరిష్కార మార్గాలను అన్వేషించే శాంతనూ, శుభనూ, జనార్ధనాన్నీ; లక్ష్మినీ అతడు-ఆమె నవలలో లక్ష్మణరావుగారు చిత్రించారు.

ఒక భార్యాభర్తల కేసు విషయంలో శాస్త్రి ఆ భార్యను రకరకాల ప్రశ్నలు వేసి అవమానించి భర్తను గెలిపిస్తాడు. ఆ భర్తకూడా అవినీతిపరుడే గదా భార్యను మాత్రమే ఎందుకలా అవమానించావు' అని శాంతం అడుగుతుంది. శాస్త్రి "అదేమిటి నేనతని తరపున వకీలునుగదా అతన్నెలా అవమానిస్తాను" అంటాడు. అప్పుడు శాంతం "అసలీ అన్యాయం అంతా ధర్మశాస్త్రంలోనే ఉంది. మొగాడికో న్యాయం ఆడదానికో న్యాయం. ప్రభువుకో న్యాయం భృత్యువుకో న్యాయం-ఈ బూటకపు ధర్మశాస్త్రం కల్పించి నీలాంటి వాళ్ళు పొట్టనింపుకుంటున్నారు. నువ్వు న్యాయంకోసమే తాపత్రయపడితే నీ క్లయింటు ధర్మరాజే అన్నట్టెందుకు వాదిస్తావు? నిజం మభ్యపరచి నువ్వు న్యాయానికి అడ్డురావటంలేదా" అని ప్రశ్నిస్తుంది, దానికి శాస్త్రి "అంతా నిజమే. కానీ నేనేం శాస్త్రకారుణ్ణా? మనువునా? ఈ ప్రపంచ మహా ప్రవాహంలో నేనూ ఒక నీటిబొట్టును. నా కుటుంబంకోసం నా పొట్టకోసం నేను యమయాతన పడుతుంటే నన్ను నానా మాటలంటే నేనేం చేయగలను?" అనుకుంటాడు.

శాంతం దృష్టి సంస్కారదృష్టి. శాస్త్రి దృష్టి మామూలు మనిషి దృష్టి. ఇంకా బాగా చెప్పాలంటే జంతు దృష్టి. సబ్జక్టివ్‌గా తప్ప ఆలోచించదు. జంతువులుకూడా వాటి కష్ట సుఖాలకే అవి స్పందిస్తాయి. మిగిలిన విషయాలగురించి ఆలోచించేశక్తి వాటికుండదు. అటువంటి జంతుదృష్టికీ శాంత సంస్కారదృష్టికీ అనేక విషయాల్లో ఘర్షణ కల్పించి చర్చలు జరిపించి శాస్త్రి స్వార్థంపట్ల మనకు అసహ్యం కలిగిస్తారు. శాంతం సంస్కార దృష్టిపట్ల ఆసక్తినీ గౌరవాన్నీ పాఠకులలో కలిగిస్తారు. ఈ రకంగా అతడు-ఆమె మనుషులనూ వారి జీవితాలనూ సంస్కరించగల శక్తివున్న నవల.

## జాతీయోద్యమ నవల

జాతీయోద్యమాన్ని గురించి చాలా లోతుగా చర్చించిన నవల అతడు- ఆమె. ఈ నవలలో జాతీయోద్యమాన్ని గురించిన ఎన్ని వివరాలో ఉన్నాయి. తెలుగు నవలల్లో జాతీయోద్యమాన్ని యింతగా తీసుకొచ్చిన రచయితలు మరి కనిపించరు. మాలపల్లి జాతీయోద్యమ భావాలతో ఒచ్చిన మొదటి నవల. ఐతే అందులో జాతీయోద్యమ ప్రత్యక్ష చిత్రణకంటే ఆ ఉద్యమంలోని అభివృద్ధికర భావాలను ఒక పల్లెలోని కొందరు వ్యక్తుల జీవితాలకు అన్వయించి చూపటానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంది. ఆ నవల 1920వ సంవత్సరానికే రాయటంవల్ల ఆ పరిమితులలోనే మనం ఆ నవలను చూడాలి. 'కోనంగి', 'కొల్లాయి గట్టితేనేమి' మొదలైన రచనలు 1920ల నాటి ఉద్యమాన్ని చిత్రించాయి.

జాతీయోద్యమాన్ని అన్ని కోణాలనుంచీ పరిశీలించి చిత్రించిన నవల అతడు - ఆమె. ఉప్పు సత్యాగ్రహం నుండీ క్విట్టిండియా ఉద్యమం వరకూ జాతీయోద్యమంలోని అన్ని ధోరణులనూ లక్ష్మణరావుగారు చెప్పారు.

ఈ నవలలో 1920 ల నాటి ఉద్యమాన్ని గురించి కొన్ని వివరాలు మాత్రం ఉన్నాయి. ఉద్యమ వివరాలను యిచ్చేపని నవలాకారుడిగా లక్ష్మణరావుగారు పెట్టుకోరు. ఆ ఉద్యమం తాలూకూ ప్రభావం సమాజంపై వ్యక్తులపై ఎలావుందో మాత్రమే వివరిస్తారు. చరిత్రకు సంబంధించిన నవలలను రాసే రచయితలు చేయవలసినది అదే. 1920ల నాటి సహాయనిరాకరణోద్యమం ప్రారంభమయ్యేనాటికి శాంతం, శాస్త్రిలకు వివాహంకాలేదు, శాంతం క్వీన్స్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తోంది. శాంతకు ఆ ఉద్యమం వాళ్ళ మామయ్య ద్వారా పరిచయం. ఆయన గాంధీగారి శిష్యుడై సబర్మతి వెళ్ళొచ్చి అలాంటి ఆశ్రమం ఒకటి తన ఊళ్ళో పెడతాడు. దానితో నానా చికాకులూ పడి ఎత్తేసి మళ్ళీ మామూలు సంసార ధోరణిలో పడిపోయాడు. అదొక నవ్వులాట విషయంగానే శాంతం తీసుకుంది. అప్పుడామె రాజకీయాల గురించి పెద్దగా ఆలోచించలేదు. వాటికి దూరంగా ఉందామనికూడా అనుకుంది. శాస్త్రికూడా ఆ ఉద్యమాన్ని గమనించాడు. అతనికేమీ నచ్చలేదు. గాంధీవాదం పనికొచ్చేది కాదని అప్పుడే తేల్చుకున్నాడు. ఎంత స్వార్ధపరుడైనా చాలా తెలివిగలవాడు గనుక తన ధోరణిలోనే చాలా సత్యాలు చెప్పాడు. అతను ఏ ధోరణిలో ఆలోచించాడనేది పక్కన బెడితే శాస్త్రి ఆలోచనలు చాలావరకు ఈనాడు నిజమై కూర్చున్నాయి. గాంధీ రాజకీయాల గురించి శాస్త్రి "నీతికీ రాచరికానికీ మేళం కుదురుతుందా? రెండింటికీ సమన్వయం చెయ్యాలని గాంధీ అన్నంతమాత్రాన్న కుదురుతుందా? అంతేకాదు. ఇప్పుడు అస్పృస్యతా నివారణ, హిందూ మహమ్మదీయ ఐక్యత అని ఎంత అరుస్తున్నాడో యితను-అంత హిందూ మహమ్మదీయ ద్వేషం, బ్రాహ్మణ శూద్ర ద్వేషం, పంచమ ద్వేషం స్థిరం ఐపోతుంది. ఇంక స్వరాజ్యమా? ఇంగ్లీషు వాళ్ళకీ మనకీ పుస్తిముడి మరింత బిగుస్తుంది" ఇప్పుడు దేశంలో సరిగ్గా అదే పరిస్థితివుంది. శాస్త్రి వూహలు అక్షరాలా నిజమయ్యాయి. ఈ పరిస్థితి ఎలా సంభవించింది? గాంధీ సిద్ధాంతాలు ఆచరణ సాధ్యమైనవి కావు. అవి ఏటికెదురీదే సిద్ధాంతాలు. ఏటికి ఎదురీదుదామని ప్రయత్నించినవాడు ఆ ప్రవాహ వేగానికి తట్టుకోలేక అసలు ఈదకుండా వుంటాడు. లేకపోతే ఈదుతున్నట్టు నటిస్తూ ఒడ్డమ్మటే పోతుంటాడు. రాజకీయాల్లోగానీ నీతిలోగానీ వర్గాల పాత్ర మర్చిపోతే అయోమయంతప్ప మరొకటి ఉండదు, వర్గపోరాటం అనివార్యమవుతున్న దశలో వర్గసామరస్యాన్ని బోధించితే జరిగేదంతే. ఈ ఆలోచనలు మనలో రేకెత్తించటానికే లక్ష్మణరావుగారు శాస్త్రిచేత ఆ మాటలు రాయించారు. శాస్త్రి వూహలు చదివి మనం ఆలోచించకుండా ఉండలేం, శాస్త్రి మాటలు నిజమయ్యాయి. ఏమిటి? ఎందుకు? అని ఆలోచిస్తాం. మంచి రచయిత అట్లా ఆలోచనలను రేకెత్తిస్తాడు. మనకోసం ఆలోచించిపెట్టే రచయితకంటే మనలో ఆలోచనలు రేకెత్తించగలిగిన రచయితే సమర్ధుడు. ఎందుకంటే ఉపదేశం మన వ్యక్తిత్వాన్ని అవమానిస్తుంది. ఆలోచనరేపే గుణం మన వ్యక్తిత్వాన్ని మేల్కొల్పుతుంది.

శాంతం మొదటిసారి రాజకీయాల గురించి ఆసక్తితో శ్రద్ధగా ఆలోచించింది ఉప్పుసత్యాగ్రహ సమయంలోనే, ఒకరోజు శాంతం 'యంగిండియా' చదువుతుంది "మామూలు గాంధీగారి యంగిండియావే. ఎంచేతో ఈవేళ చదివేసరికి ఒక్కసారి ఒళ్ళంతా ఝల్లుమంది. కళ్ళు మూతబడ్డాయి. మూసుకున్న కళ్ళముందే ఏవో నిప్పుగోళాల్లాగా పరిగెట్టాయి. మనసులో ప్రళయంలాగొచ్చేసింది" కొద్దిసేపు ఆ స్థితిలో ఉన్నాక శాంతం తన దగ్గరున్న మిల్లు బట్టలన్నీ తగలేసి ఖద్దరు దీక్ష స్వీకరిస్తుంది. శాంతంలో ఆ మార్పు ఆ చైతన్యం ఒక్కసారి ఎందుకు కలిగాయి? ఇన్నాళ్ళు చదువుతున్న 'యంగిండియా' యివాళ ప్రత్యేకమైన ఉత్తేజాన్ని ఎలా యిచ్చింది? వేళా విశేషమా? కాదు. ఆ రోజు శాంతం చదివిన 'యంగిండియా' ప్రత్యేకమైనదే అయుంటుంది. 1930 ఏప్రిల్ 10 వ తారీఖున 'యంగిండియా'లో గాంధీ ప్రత్యేకించి స్త్రీలకు ఒక విజ్ఞప్తి చేశారు. ఖద్దరు ధరించమనీ, పికెటింగులు చేయమనీ బోధించారు. ఆ 'యంగిండియా'లోని గాంధీ విజ్ఞప్తి దేశంలో ఎందరో మహిళలను ప్రభావితం చేసి ఉద్యమంలోకి తీసుకువచ్చింది. ఆ 'యంగిండియా' చదివే శాంతం ఉత్తేజితురాలయి వుంటుంది. ఆ రోజునుంచీ ఆమె ఏదో ఒకరకంగా ఉద్యమంతో సజీవ సంబంధం పెట్టుకుంది. సత్యాగ్రహ శిబిరాలకు హాజరయింది. ఆ రోజుల్లో సత్యాగ్రహ శిబిరాలకు సంపన్నవర్గాల మహిళలు కొందరు

హాజరయ్యేవారు. ఆ స్త్రీల భర్తలో తండ్రులో వారిని పోలీసుల బారిన పడకుండా రక్షించేవారు. ఆ శిబిరాలపై ఎప్పుడు దాడి జరుగుతుందో వీరికి సన్నిహితులైన పోలీసు ఆఫీసర్లు చెబితే ఆ రోజు వారింట్లోని స్త్రీలను శిబిరానికి వెళ్ళకుండా ఆపేవారు. శాంతంని శాస్త్రి అలాగే రక్షించాడు. బెంగుళూరు తీసికెళ్లాడు. శాంతంకు ఈ లోపలి తంత్రం తెలియక శాస్త్రితో వెళ్ళింది. "రోజూ నేను శిబిరానికి వెళ్ళేదానిని, ఆ ముందురోజు బెంగుళూరు వెళ్లాను అనుకోకుండా. ఆ మర్నాడు వచ్చేద్దాం అనుకుంటే కారు టైరు చెడిపోవటంచేత వేళకి బయలుదేరలేకపోయాం. మరునాడు చెన్నపట్నం చేరేసరికి శిబిరం అంతా మూసేసి సీళ్ళు వేసేసివుంది. నా స్నేహితురాళ్ళందరూ ఏవో పనుల్లో వుండిపోయి ఆ శిబిరానికి ఎవ్వరూ వెళ్ళలేదుట." దాదాపు సంపన్నవర్గాల వారంతా ఆరెస్టును తప్పించుకున్నారన్నమాట. జాతీయోద్యమంలో ఏ వర్గపు పాత్ర ఎలాంటిదో తెలుసుకోటానికి యిలాంటి సంఘటనలు బాగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా ధనికవర్గం జాతీయోద్య మాన్ని తమ స్వప్రయోజనానికి ఎలా వినియోగించుకుందో ఈ నవలలో లక్ష్మణరావుగారు చెప్పారు.

శాంతం అనుకోకుండా ఉద్యమంలో లాఠీదెబ్బలు తిన్నది. తనకళ్ళ ఎదుట పోలీసులు సత్యాగ్రహులను కొడుతుంటే చూసి సహించలేక వారికి అడ్డుగా వెళ్ళి దెబ్బలు తిన్నది. మానవత్వం కలిగిన మనిషిగా ప్రవర్తించింది. లాఠీదెబ్బలు బలంగా తగలటంతో ఆస్పత్రిలో చేరింది. తర్వాత రెండు నెలలు విశ్రాంతి తీసుకుంది. ఆరోగ్యం పాడవటంవల్ల జైలుకెళ్ళే ఉద్దేశం మానుకుంది. హరిజన సంఘంలో చేరి కొన్నాళ్ళు పనిచేసి మానేసింది. ఆ సంఘం పనిచేసే తీరు ఆమెకు నచ్చలేదు. హరిజన సంఘాలు గానీ మరే యితర సంఘాలు గానీ సంపన్న వర్గాలు నడిపితే తమ స్వలాభం కోసం పేరుకోసం నడుపుతారే గాని యింకోదానికి కాదు. శాంతం పనిచేసిన హరిజన సంఘంలోని సభ్యులెవరూ తమ యింటి నూతిలో హరిజనుల చేత నీరు తోడించటానికి ఒప్పుకోరు. తలా ఒక సాకు చెప్పి తప్పించుకుంటారు. మళ్ళీ వీళ్ళంతా హరిజనోద్ధారక సంఘానికి పాతికవేలూ, ముప్పైవేలూ చందా యిచ్చినవారే. ఆ యివ్వటంలో రకరకాల స్వార్థప్రయోజనాలుంటాయి. గాంధీ మొదలు పెట్టిన ప్రతి ఉద్యమాన్నీ ఆ రోజుల్లోనే సంపన్న వర్గాలు క్యాష్ చేసుకున్నాయి.

ఖద్దరు ఉద్యమం రోజుల్లో-

"ఆ బొంబాయి ఆహమ్మదాబాదు సేట్లు గిరాకీ రోజుల్లో ఖద్దరని పేరుతో మిల్లుగుడ్డ తయారుచేసి అమ్మేశారు. ప్రజలూ కొనేశారు"- మళ్ళీ ఈ సేట్లే కాంగ్రెస్‌కి చందా యిచ్చేవాళ్ళు. చందాలకు సత్యాసత్యాలుండేవి కాదు గాబోలు. శాంతం నిజాయితీకి యిలాంటి రుద్రాక్ష పిల్లుల ప్రవర్తన సరిపడలేదు. అందువల్ల ఆమె హరిజన సంఘంలో కూడా పని చెయ్యటం మానేసి యింట్లో రాట్నం ఒడుకుతూ కూర్చుంది. ఇంతలో గాంధీ ఉద్యమాన్ని ఆపెయ్యమన్నాడు. 1931 మార్చి 5న గాంధీ- ఇర్విన్ ఒప్పందం కుదరటంతో ఉద్యమాన్ని నిలిపివేయమని గాంధీ కాంగ్రెసు తరపున ప్రజల్ని కోరాడు. అది సహజంగానే శాస్త్రికి చాలా సంతోషం కలిగించింది. శాంతంకు మాత్రం చాలా ఆందోళన కలిగించింది. ఉద్యమాన్ని గురించి చాలా సందేహాలు కలిగాయి. చాలా ప్రశ్నలు వేసుకున్నది. "మొత్తం మీద చూస్తే ఉద్యమం దేశంలో అందరినీ కూడగట్టుకు రాలేక పోయిందేమో అనిపిస్తోంది. పల్లెటూరి జనం, రైతులూ, కూలినాలి చేసుకునేవాళ్ళు-వీళ్ళ నెవరినీ ఆకర్షించ లేకపోయింది. వాళ్ళని దూరంగా ఉంచేసింది కూడా. ఎన్ని కబుర్లు చెప్పినా నాయకత్వం మధ్యతరగతి వాళ్ళ చేతుల్లో పడిపోయింది. ప్రొఫెసరు సుందరరామన్నూ, జమిందారు వియ్యన్నా ఆరునెలలు జైల్లో కూర్చున్నంత మాత్రాన నాయకులైపోతే ఎల్లా? నాకు విముఖత ఏర్పడటానికి సహం యిదే కారణం. నాలాంటి వాళ్ళందరినీ కుర్రకుంకలనీ, సోషలిస్టులనీ తిడుతుంటే ఈ నాయకులు దేశాన్ని ఏం ముందుకు తీసుకు వస్తారు? నాయకుల్లో లోపమా? అసలు తత్త్వంలో లోపమా? కాంగ్రెసు డబ్బున్న వాళ్ళ చేతుల్లోకి వెళ్ళిపోతుందా?" ఈ వాక్యాలు నవలలో చదివాక చరిత్రనొక్కసారి తిరగవేసి చూడకపోతే, శాంతం ఆలోచనలలోని సారాంశాన్ని అర్థం చేసుకోకపోతే 'అతడు-ఆమె' నవలలోని గొప్పతనం మనకు అర్థంకాదు. కేవలం చరిత్ర చెప్పటం ఈ నవల ఉద్దేశంకాదు. చరిత్రను గురించి కొన్ని ఆసక్తికరమైన ప్రశ్నలు లేవనెత్తి పాఠకులలో ఆలోచనలు రేకెత్తించటం ఈ నవలయొక్క పని. శాంతం ఆలోచనలను చదివేసి ఆ నవలను పక్కనపడేసి ప్రశాంతంగా ఊరుకుంటే "అతడు-ఆమె" నవలవల్ల పాఠకుడు పూర్తి ప్రయోజనాన్ని పొందినట్టుకాదు.

జాతీయోద్యమం ఎలా నడిచిందో సరైన అవగాహన లేకపోతే ఈనాడు మనం మన స్థితిని అర్థంచేసుకోలేము. గతచరిత్ర లేకపోతే వర్తమానచరిత్ర లేదు. ఈ రోజు మనం స్వతంత్రులమా? అస్వతంత్రులమా? అన్న ప్రశ్న వేసుకుంటున్నాం. ఎందుకంటే స్వతంత్ర దేశంలో పౌరులందరు తమకున్న సర్వశక్తుల్నీ వెలికి తెచ్చుకుని తమ జీవితాలనూ, దేశాన్నీ కూడా అభివృద్ధిచేసే అవకాశం కలిగివుంటారు. కానీ నేడు మనం మన శక్తుల్ని వెలికితెచ్చే మాట అటుంచి కనీస ఉనికికోసం తెగించి పోరాడాల్సిన స్థితిలో ఉన్నాం. ఎందుకిలా జరిగింది? ఆగస్టు 15న మనకు స్వతంత్రం రాకపోగా అధికార మార్పిడి అనే ద్రోహం జరిగిందని ఈరోజు విప్లవ పార్టీలు విశ్లేషించి చెబుతున్నాయి. స్వతంత్రం వచ్చిందా రాలేదా? వచ్చినది స్వతంత్రం ఔనా కాదా అని తేల్చుకోవాలంటే స్వాతం

త్రోద్యమాన్ని గురించి తెలుసుకోవాలి. తెలుసుకోవటానికి రాజకీయ గ్రంధాలు చాలా ఉన్నాయి. సామాన్యులకు వాటిపై ఆసక్తి కలగాలి. సామాన్యులకు రాజకీయ సామాజిక సమస్యలపట్ల ఆసక్తిని కలిగించి ఆలోచింపజేయటమే అభ్యుదయ రచయితల పని. ఆ పనిని లక్ష్మణరావుగారు ఎంతో బాధ్యతతో నిర్వహించారు.

1930ల నాటి సత్యాగ్రహోద్యమం ఎందుకు మొదలయిందీ ఎందుకు ఆగిపోయిందీ, అందులోని సత్యా సత్యాలేమిటీ ఇవి తెలుసుకుంటేగాని శాంతం ప్రశ్నలకు మనకు సమాధానాలు దొరకవు.

1929 అక్టోబరు 1న అప్పటి భారతదేశ వైస్రాయి ఇర్విన్ ఒక ప్రకటన చేశాడు. ఇండియాకు డొమీనియన్ స్టేటస్ యిచ్చే విషయంలో బ్రిటీష్ ప్రభుత్వం సుముఖంగా ఉన్నదని ఆ ప్రకటన సారాంశం. భారతదేశంలో చాలామంది ఆ ప్రకటనకు సంతోషించారు. డొమీనియన్ రాజ్యాంగాన్నీ తయారు చెయ్యటంలో వైస్రాయితో సహకరిస్తామని గాంధీ మోతీలాలువంటి కాంగ్రెసు పెద్దలు ప్రకటించారు. జరగబోయే రౌండ్ టేబిల్ సమావేశంలో డొమీనియన్ స్టేటస్ ఎప్పుడివ్వాలి అనేదిక సమస్యకాదనీ దానిని గురించి చర్చించన వసరంలేదనీ (అంటే వెంటనే యిచ్చేసినట్లే ప్రకటించాలని) డొమీనియన్ రాజ్యాంగాన్ని తయారుచేయటమే రౌండ్‌టేబిల్ పని అని వారు అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌లోని వామపక్షం వారు దీనిని సమర్ధించలేదు. వారు సంపూర్ణ స్వతంత్రాన్ని కోరారు. ఐనా డిసెంబరు 23వ తారీకున గాంధీ, మోతీలాలు వైస్రాయిని కలుసుకున్నారు. ఐతే వైస్రాయి వీళ్ళకు రౌండ్‌టేబిల్ సమావేశంలో డొమీనియన్ స్టేటస్ యిచ్చేస్తున్నట్లుగానీ, డొమీనియన్ రాజ్యాంగాన్ని తయారు చెయ్యటమే రౌండ్ టేబిల్ పని అనిగానీ హామీ యివ్వలేకపోయాడు. అప్పటికే ఇండియాకు డొమీనియన్ స్టేటస్ యిస్తానన్నందుకు లేబర్ పార్టీపై తీవ్రమైన విమర్శలు బ్రిటిషు పార్లమెంటులో ఒచ్చాయి. దానితో ఇర్విన్ గాంధీ తదితరులకు ఏ రకమైన హామీనీ యివ్వలేకపోయాడు. గాంధీ ఒట్టి చేతులతో తిరిగి వచ్చాడు.

1929వ సంవత్సరం డిసెంబరులోనే లాహోరులో కాంగ్రెసు సభలు జరిగాయి. ఆ సభలలో సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభిస్తూ తీర్మానం చేశారు. అంతకుముందునుంచీ డొమీనియన్ స్టేటస్ కాదు సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలంటున్న వామపక్షం వారికిది విజయం. ఐతే అంతకుముందు డొమీనియన్ స్టేటస్ యిస్తామంటే సంతోషించిన గాంధీ నిజంగా సంపూర్ణ స్వాతంత్రం కోరి ఈ తీర్మానం చెయ్యటంలో పాల్గొన్నాడా?

సత్యాగ్రహోద్యమం ప్రారంభమైంది. లెజిస్లేటివ్ సభ్యులను రాజీనామా లిమ్మన్నారు. 1930 మార్చి నెలలో గాంధీ దండియాత్రనూ, ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రారంభించాడు.



మార్చి 2వ తారీకున గాంధీ వైస్రాయికి ఒక ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరంలో గాంధీ చెప్పిన విషయాలకీ లాహోరులో కాంగ్రెసుచేసిన తీర్మానానికీ ఏమీ సంబంధం లేదు. బ్రిటిషు ప్రభుత్వం కొన్ని దుర్మార్గపుచర్యలను అనుసరిస్తోందనీ, ఆచర్యలను వెంటనే రద్దుచేయాలనీ వైస్రాయిని గాంధీ కోరాడు. అవి రద్దుచేయని పక్షంలో సత్యాగ్రహాన్ని ఆరంభిస్తానని రాశాడు. అంటే ఆ చర్యల రద్దుకోసం సత్యాగ్రహోద్యమం ప్రారంభించ బడుతోందని వైస్రాయికి చెప్పదల్చుకుని ఆ ఉత్తరం రాశాడన్న మాట, నిజానికి లాహోర్ కాంగ్రెసు దేనికోసం సత్యాగ్రహోద్యమానికి పిలుపిచ్చింది? సంపూర్ణ స్వాతంత్ర్యం కోసమని, అలాంటప్పుడు అంత గొప్ప ఉప్పు సత్యాగ్రహాన్ని మొదలుబెట్టపోతున్న గాంధీ వైస్రాయికి తాను రాసిన ఉత్తరంలో సంపూర్ణస్వాతంత్రాన్ని మొదటి ముఖ్యమైన డిమాండ్‌గా ఎందుకు పెట్టలేదు? ఆ ఉత్తరాన్ని గురించి గాంధీని అష్ట కష్టాలుపడి అనుసరించిన నెహ్రూ ఏమన్నాడో చూడండి. "మనం పూర్తి స్వాతంత్ర్యాన్ని కోరుతున్నపుడు కొన్ని రాజకీయ సాంఘిక సంస్కరణలుచెయ్యమని బ్రిటిష్ వారి నడగటంలో అర్థం ఏముంది?" అన్నాడు. అర్థం ఒకటే ఉండి వుంటుంది. సంపూర్ణ స్వతంత్రాన్ని కోరుతూ గాంధీ ఈ సత్యాగ్రహోద్యమాన్ని ఆరంభించలేదు. కొన్ని సంస్కరణలను మాత్రమే కోరాడు. గాంధీ కోరికలను ఇర్విన్ ఒప్పుకోలేదు. గాంధీకిక ఉద్యమం తప్ప గత్యంతరం లేకపోయింది. దండియాత్ర ప్రారంభించాడు.

దేశంలో అశేష ప్రజానీకం స్వాతంత్ర్యంకోసం. స్వాతంత్ర్యంకోసమే–గాంధీ కోరిన సంస్కరణలకోసంకాదు ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి యుద్ధంలోకి దూకారు. బ్రిటీష్ ప్రభుత్వం ప్రజలపై పాశవికమైన నిర్బంధాన్ని ప్రారంభించింది. ఐనా ప్రజలు లెక్కచెయ్యక ముందుకు దూకారు. లాఠీ దెబ్బలూ, జైలు జీవితం. చిత్రహింసలూ అన్నింటినీ ప్రజలు సహించి నిలిచారు. దేనికోసం? స్వాతంత్ర్యంకోసం. నాయకత్వ స్థానాల్లోవున్న సంపన్న వర్గాలు ఉద్యమాన్ని నీరుగార్చటానికీ, తమ స్వప్రయోజనాలకు వాడుకోవటానికీ ప్రయత్నించాయి. ఏప్రిల్–మే నెలల్లో వందలాది ప్రజలు పోరాటంలో అమరులయ్యారు. జైళ్ళు నిండిపోయాయి. అప్పుడు బ్రిటీషు ప్రభుత్వం రాజీధోరణి కనపరచక తప్పలేదు. రౌండ్ టేబిల్ సమావేశాన్నించి తిరిగివచ్చిన సప్రూ అలహాబాదులో కాంగ్రెస్ కార్యవర్గంతో చర్యలు జరిపాడు. గాంధీ స్వయంగా వైస్రాయిని కలిస్తే ఫలితం వుంటుందని సలహా ఒచ్చింది. దానికి గాంధీ అంగీకరించాడు. వైస్రాయీ అంగీకరించాడు. 1931 ఫిబ్రవరి 17న గాంధీ ఇర్విన్‌లు కలుసుకున్నారు. మార్చి 4వ తారీకు వరకూ చర్చలు జరిగాయి. మార్చి 4న గాంధీ ఇర్విన్‌తో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకొని దాని పాఠాన్ని కాంగ్రెసు వర్కింగ్ కమిటీ ముందుంచాడు. గాంధీ మాటే తమ మాటనే వర్కింగ్ కమిటీ సభ్యులు

దానిని ఆమోదించారు. మార్చి 5వ తారీకున ఆ ఒప్పందంపై గాంధీ ఇర్విన్‌లు సంతకాలు చేశారు.

ఆ ఒప్పందంలో మొదటి పేరాలోనే సత్యాగ్రహ ఉద్యమాన్ని ఆపేస్తున్నట్లు ప్రకటించారు. సంపూర్ణ స్వతంత్రాన్ని గురించి ఏమీ చెప్పలేదు. రక్షణ, విదేశీ వ్యవహారాలూ, ఆర్థిక విషయాల్లో ఇండియాకు స్వతంత్ర ప్రతిపత్తి యిచ్చేది లేదనేదే ఆ ఒప్పంద సారాంశం. ఇంతకూ మనకు యిన్నాళ్ళ ఉద్యమానికిగాను దక్కిన ఫలితమేమిటి?

1929 డిసెంబరు 23న వైస్రాయితో చర్చించి ఎందుకు ఒప్పందానికి రాలేకపోయారు? రౌండ్‌టేబిల్ సమావేశాన్ని ఎందుకు తిరస్కరించారు? రెండేళ్ళ తర్వాత యింత ఉద్యమం జరిగాక యిందరు ప్రజలు అమరులయ్యాక ఆనాటి బేరానికే మళ్ళీ తలలొగ్గారు. ఈ ఉద్యమం లేకుండానే ఈ ఒప్పందం కుదిరేదిగదా. దండియాత్రను మొదలుపెడుతూ "ఈ ఉద్యమం చివరి సత్యాగ్రహి గొంతులో ఊపిరి వున్నంతవరకూ ఆగదు" అని ప్రకటించిన గాంధీ ఉద్యమాన్ని ఎందుకు ఆపినట్లు? మొదలు పెట్టినది స్వతంత్రం కొరకు కాదుగనుక స్వతంత్రం ఒచ్చేవరకూ కొనసాగించాలని గాంధీ అనుకోలేదు. కానీ ప్రజలు స్వాతంత్ర్యంకొరకు పోరాడారు. వారికి ఉద్యమం ఆగటం చాలా బాధాకరం. ఒక ఉద్యమాన్ని మొదలుపెట్టటంలో నాయకత్వం ఏం ఆశిస్తోంది? ఏ లక్ష్యాలను ప్రకటిస్తోంది. అన్నది అర్థంచేసుకోకుండా నాయకత్వాన్ని ప్రజలు అనుసరించకూడదనే విషయం పై చారిత్రక ఘటనలవల్ల తెలుస్తోంది. జాతీయోద్యమ నాయకత్వ స్వభావం ఏమిటి? ఆ నాయకత్వం ప్రజల చైతన్యాన్ని ఎలా అర్థం చేసుకుంది? అన్న విషయాలను మనం అర్థంచేసుకోవాలనే ఆలోచన 'అతడు-ఆమె' యివ్వగలిగింది.

శాంతం "నాయకత్వంలో ఉందా లోపం అసలు తత్వంలో ఉందా" అని ఆలోచించటం వెనుక యింత కథ ఉంది. ఈ కథ ఆ రోజు శాంతంకు తెలియకపోవచ్చు కానీ ఆమె డైరీలో ఆమె ఆలోచనలను చదివాక ఈ కథంతా తెలుసుకోవటం మన కర్తవ్యం. జాతీయోద్యమం ఎలా సాగిందో నాయకత్వ లోపాలేమిటో మనం శాంతంకు వారసులంగా తెలుసుకోలేకపోతే యికపై మనదేశ విముక్తిని సాధించలేము. నాయకత్వం యింత అస్తవ్యస్తంగా ఉన్నది గనుగనే అవకాశవాదులు విజృంభించగలిగారు. సత్యాగ్రహం రోజుల్లో జైలుకు వెళ్ళిన సంపన్న వర్గాలు ఎన్నికలలో పాల్గొని పదవులు సంపాదించటానికి అదొక సర్టిఫికెట్ చేసుకున్నాయి. దానిని శాంతంవంటి చైతన్యపరులు అసహ్యించుకున్నారు.

శాంతం వివాహ జీవితంలో పెద్ద అగాథం యిక్కడే ఒచ్చింది, సత్యాగ్రహోద్యమంలో శాంతం లాఠీ దెబ్బలు తిన్నది. కొన్ని రోజులు నిజాయితీగా పనిచేసింది. దానిని ఆధారంగా





చేసుకుని శాస్త్రి కాంగ్రెస్ టిక్కెట్ సంపాదించి ఎన్నికలలో నిలబడాలనుకున్నాడు. శాంతంకు తన కోరిక చెప్పాడు. శాంతం చాలా అసహ్యించుకుంది. శాస్త్రి ముఖం చూడలేక పోయింది. పాపాయినీ సుభనీ తీసుకుని యిల్లు వదిలి వెళ్ళింది. శాస్త్రిలో ఈ స్వార్థం తగ్గి మార్పు వచ్చాకనే అతనితో జీవితం మొదలు పెట్టాలనుకుంది. ఈరకంగా ఉద్యమం శాంతం జీవితంలో పెద్ద మార్పు తీసుకొచ్చింది. శాంతంలోవున్న చైతన్యాన్ని మేల్కొల్పింది. అభివృద్ధిచేసింది. శాంతం ఆలోచనలకు పదునుపెట్టింది. త్యాగం చెయ్యటంలోవున్న ఆనందాన్నీ విలువనీ శాంతంకు తెలియజెప్పింది. అన్యాయాన్ని మోసాన్నీ, అవకాశ వాదాన్నీ తీవ్రంగా అసహ్యించుకోవటం నేర్పింది. బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఒణికించి, భారత ప్రజలంటె బానిసలుకారు; స్వాతంత్ర్యంకొరకు ప్రాణాలు బలిపెట్టగలరని ప్రపంచానికి చాటిన సత్యాగ్రహోద్యమం శాంతం చైతన్యంపై ఎంతో ప్రభావాన్ని చూపింది. సత్యాగ్రహోద్యమంలేకపోతే అందులో శాంతం పాల్గొనకపోతే ఆమె యింత గొప్ప ఆదర్శవంతంగా మనకు కనిపించేది కాదు. ఉద్యమం వ్యక్తులలోవున్న శక్తులనూ, విశిష్ట గుణాలనూ వెలికితీసి పదును పెడుతుందనే సత్యాన్ని ఉద్యమంలో పాల్గొన్న శాంతం ద్వారా లక్ష్మణరావుగారు నిరూపించారు.

ఉప్పు సత్యాగ్రహం తర్వాత మళ్ళీ కాంగ్రెసు ప్రజలను కార్యరంగంలోకి పిలిచిన ఉద్యమం క్విట్టిండియా ఉద్యమం. ఏ ప్రజలను ఎందుకు పిలిచింది? అనేది ఆలోచించాల్సిన విషయమే. ఈ క్విట్టిండియా ఉద్యమం గురించి అనేక ప్రశ్నలు ఆనాడూ ఈనాడూకూడా వున్నాయి. ఈనాడైనా ఆ ప్రశ్నలకు సరైన సమాధానాలు పొందకుండా మనం ముందుకు సాగలేం. క్విట్టిండియా ఉద్యమానికి సంబంధించిన వివరణ విశ్లేషణ అతడు-ఆమె నవలలో ఉన్నంతగా మరింకే తెలుగు నవలలోనూ లేదు. ఈ నవలలోని వ్యక్తులు ఆనాటికి జాతీయోద్యమంలో నాయకత్వ స్థానాల్లోవున్నారు. గనుక ఉద్యమం గురించీ అన్ని వివరాలనూ యివ్వగలిగారు. క్విట్టిండియా ఉద్యమానికి పిలుపు నిచ్చింది కాంగ్రెసు. ఆ పిలుపును యిచ్చినప్పటి జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు ప్రత్యేకమైనవి. అందువల్ల దేశంలోని రకరకాల రాజకీయ పార్టీలు రకరకాల వైఖరులను ప్రదర్శించాయి. కొందరు ఉద్యమంలో అహింసాయుతంగా పాల్గొన్నారు. కొందరు సాయుధంగా పాల్గొన్నారు. కమ్యూనిస్టులసలు పాల్గొనలేదు. సుభాస్‌చంద్రబోస్ దేశంలోలేడు. ఆయన జర్మనీ జపాన్‌ల సాయం అర్థించాడు. ఈ పరిస్థితినంతా ఈ నవల చిత్రించింది. శాంతం అహింసాయుతంగా ఉద్యమంలో పాల్గొనాలంటుంది. సుభ ఏదో ఒక చర్య, ప్రభుత్వ వ్యతిరేకమైనది చేసి ఉద్యమంలో పాల్గొనాలంటుంది, లక్ష్మి కమ్యూనిస్టులను అనుసరించే స్థితికి ఎదుగుతుంది. జనార్థనం వంతెనలు పడగొట్టటంవంటి చర్యల్ని కూడదంటాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=363**